
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 12 । మార్చి । 2025



భక్తుల కొంగుబంగారం..

అన్నపురెడ్డిపల్లి శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సా॥) 6.24

సహర్ (గురువారం ఉ॥) 5.02

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 22°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం ప్రారంభమయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

16న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కొత్తగూడెంటౌన్: దమ్మపేటలోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 16న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మహీదర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జావెలిన్‌త్రో, 100, 400 మీటర్ల పరుగుపందెంలో బాలురు, బాలికలు, స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, వివరాలకు కోచ్ జె.కృష్ణ(70135 52707)ను సంప్రదించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

భద్రాచలం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన కొనసాగుతున్న మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. కిన్నెరసానిలోని బాలురు, కాచనపల్లిలోని బాలికల స్పోర్ట్స్ స్కూళ్లతో పాటు హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ఐదో తరగతికి ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు డివిజన్ స్థాయిలో ఈనెల 16 నుంచి 18వరకు, జిల్లాస్థాయిలో 26 నుంచి 28వ తేదీ వరకు పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 9 - 11 ఏళ్ల వయస్సు కలిగిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని వెల్లడించారు. భద్రాద్రి జిల్లా విద్యార్థులు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో, ఖమ్మం జిల్లా విద్యార్థులు ఉసిరికాయలపల్లిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగే డివిజన్ స్థాయి పోటీలకు అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. అపై జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు తుది ఎంపిక పోటీలు నిర్వహించి ప్రవేశాలకు అర్హులను ఎంపిక చేస్తామని పీఓ తెలిపారు.

సింగరేణిలో లైజన్ ఆఫీసర్ల నియామకం



సీఎండీ బలరాం చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా విస్తరించి ఉన్న 11 ఏరియాలకు 11 మంది లైజన్ ఆఫీసర్లను యాజమాన్యం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్ ఏరియాకు వి.మురళి, కొత్తగూడెం ఏరియాకు ఆవధూత శ్రీధర్, ఇల్లెందుకు జి.నాగేషు, మణుగూరుకు పి. వీరభద్రరావు, ఆర్జీ-1కు పి.శ్రీనివాస్, ఆర్జీ-2కు పి.వేణుగోపాల్. ఆర్జీ -3కి చంద్రశేఖర్, భూపాలపల్లి ఏరియాకు పి.బాలరాజు, బెల్లంపల్లికి ఎం.మధుకుమార్, మందమర్రికి ఎండీ ముస్తఫా, శ్రీరాంపూర్ ఏరియాకు ఎస్. సత్యనారాయణను నియమిస్తున్నట్లు ప్రకటించింది.

ప్రగతికి బాటలు పడేనా ?



రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభం అవుతున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్.. జిల్లా ప్రగతికి అన్ని విధాలా బాటలు వేయాలని పలువురు కోరుకుంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు తమ ప్రాంత అభివృద్ధి, సంక్షేమం కోరుతూ రాష్ట్ర సర్కారుకు నివేదికలు సమర్పించారు. ఇక అసెంబ్లీలో తమ వాణి వినిపించేందుకు సిద్ధం అవుతున్నారు.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పారిశ్రామిక ప్రాంతంగా వెలుగొందుతున్న జిల్లా

- ఎకో – టెంపుల్ టూరిజంలో అవకాశాలు
- ఎయిర్‌పోర్టు, యూనివర్సిటీపై గంపెడాశలు
- సీతారామ ద్వారా జిల్లాకు న్యాయం దక్కేనా..
- అసెంబ్లీలో వాణి వినిపించనున్న ఎమ్మెల్యేలు

పారిశ్రామిక రంగంలో..

పాల్వంచ కేటీపీఎస్‌లో కొత్తగా 400 ఎకరాల స్థలం అందుబాటులోకి వచ్చింది. అక్కడ టీజీ జెన్కో ఆధ్వర్యంలో కొత్త యూనిట్ ప్రారంభించాలనే డిమాండ్ ఉంది. అలాగే ఏపీ స్టీల్స్, స్పాంజ్ ఐరన్ స్థలాలను సెమీ కండక్టర్ల తయారీ వంటి న్యూఏజ్ పరిశ్రమలకు కేటాయించేలా విధానపరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరముంది. దీంతో పాటు కొత్తగూడెంలో మూతబడిన బేరియం ఫ్యాక్టరీ, కిన్నెర స్టీల్స్ తదితర పరిశ్రమల స్థలాలు సైతం నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని ఎలా వినియోగంలోకి తేవాలనే అంశాలపై దృష్టి సారించాలి. జిల్లాలో ఇప్పటికే పత్తి విరివిగా సాగవుతుండగా కొత్తగా వరి, పామాయిల్ సాగు పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగా రైస్ మిల్లుల వంటి అనుబంధ పరిశ్రమలు ప్రైవేట్, గిరిజన సహకార సంఘాల ఆధ్వర్యంలో వచ్చేలా ఈ బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు అందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

ఎకో - టెంపుల్ టూరిజం..

భద్రాచలం, పర్ణశాల, అన్నపురెడ్డిపల్లి, కిన్నెరసాని అభయారణ్యం, కనకగిరి గుట్టలు, మోతెగడ్డ వంటివి ఎకో - టెంపుల్ టూరిజానికి అనువుగా ఉన్నాయని ఇప్పటికే గుర్తించారు. గతంలో ప్రకటించిన టూరిజం పాలసీలో వీటికి చోటు కూడా దక్కింది. దీనికి కొనసాగింపుగా ఈ బడ్జెట్‌లో ఎకో - టెంపుల్ టూరిజానికి నిధులు మంజూరైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అలాగే గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా హోం స్టే విధానాలకు ప్రోత్సాహకాలు దక్కితే ఇంకా బాగుంటుంది. గతంలో ప్రతిపాదన దశలో ఉన్న భద్రకాళి - భద్రాచలం సర్క్యూట్‌లో భాగంగా మణుగూరు దగ్గరున్న రథం గుట్టలు - వెన్నెల జలపాతం వద్ద అభివృద్ధికి అవకాశం కల్పించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

యూనివర్సిటీకి ఇప్పటికే ప్రతిపాదనలు..

జిల్లాలోని అన్ని ప్రాంతాలకూ మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం కలించాల్సిన అవసరముంది. ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం, అందుకోసం అటవీ శాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని అసెంబ్లీలో గొంతు విప్పేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు. దీంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇప్పటికీ యూనివర్సిటీ లేదు. కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై ఈ బడ్జెట్‌లో సానుకూల నిర్ణయం వస్తుందని పలువురు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

'సీతారామ'తో న్యాయం దక్కేనా ?

ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా పేర్కొంటున్న సీతారామ ప్రాజెక్టుతో జిల్లాలోని భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదు. పినపాక, కొత్తగూడెం నియోజకవర్గాలకూ అంతంతమాత్రమే. దీంతో గోదావరి జలాలు జిల్లాలోని పొలాల్లో ప్రవహించేలా అనుబంధ పథకాలు కావాలని జిల్లా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించనున్నారు.

ఎయిర్‌పోర్టు గురించి మాట్లాడుతా



నియోజకవర్గానికి కావాల్సిన కేటాయింపులపై ఇప్పటికే పలుమార్లు లేఖలు అందించా. ప్రధానంగా కొత్తగూడెం ఎయిర్‌పోర్టు, కార్పొరేషన్ ఏర్పాటు, హరిత హోటల్ వంటి అంశాలపై అసెంబ్లీలో చర్చిస్తా. ప్రజా ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ సామాన్య, మధ్యతరగతి వర్గాలకు మేలు చేసేలా బడ్జెట్ ప్రవేశపెడుతుందని ఆశిస్తున్నా. బడ్జెట్‌లోని అంశాలను పరిశీలించాక స్పష్టమైన అభిప్రాయాన్ని అసెంబ్లీలో చెబుతా.

– కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

అటవీ అనుమతులపై ప్రస్తావిస్తా



ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు ఇప్పించే అంశంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. ఏజెన్సీ గ్రామాల్లో విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపరిచేలా నిధులు కేటాయించాలని కోరుతా. సీతారామ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గానికి గరిష్ట స్థాయిలో మేలు చేయాల్సిన అవసరంపై మాట్లాడుతా.

– పాయం వెంకటేశ్వర్లు, పినపాక ఎమ్మెల్యే

కాలేజీలు కావాలి



ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల, నర్సింగ్ కాలేజీలు మంజూరు చేయాలని కోరుతా. నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీటిని తరలించాలని డిమాండ్ చేస్తా. ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్, కొమురారం, బోడు మండలాల ఏర్పాటు అంశాన్ని ప్రస్తావిస్తా.

– కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే

ఎత్తిపోతలకు నిధులపై మాట్లాడుతా



ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రగళ్లపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. దీని వల్ల 40 వేల ఎకరాలకు రెండు పంటలకు నీరందుతుంది. అన్ని గ్రామాలకూ తాగునీరు అందించడంతో పాటు విద్య, వైద్య రంగాల్లో సేవల విస్తరణకు తగిన నిధులు కావాలని అడుగుతా.

– తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఎమ్మెల్యే

విద్య, వైద్యంపై ఫోకస్



అన్నపురెడ్డిపల్లిలో 100 పండకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతా. యంగ్ ఇండియా స్కూల్‌కు భూమి గుర్తించినందున నిధులు మంజూరు చేయాలని అడుగుతా. అశ్వారావుపేట మున్సిపల్ భవనం నిర్మాణానికి, మూకమామిడి, వెంగళరాయ సాగర్, గుమ్మడవెల్లి మధ్య తరహా ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

– జారే ఆదినారాయణ, అశ్వారావుపేట ఎమ్మెల్యే

ఐటీసీ సహకారంతో ఆర్థిక భరోసా

ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యేలు పాయం, తెల్లం



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న పీఓ, ఎమ్మెల్యేలు

బూర్గంపాడు: నిరుపేద, ఒంటరి, వితంతు మహిళలకు వృత్తి విద్యా శిక్షణ ఇచ్చి, వారి జీవనోపాధికి ఐటీసీ సహకారం అందిస్తుందని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. సారపాకలోని ఐటీసీ కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమానికి పీఓతో పాటు పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. పేద మహిళల ఆసక్తిని గుర్తించి వారికి అయా రంగాల్లో ఐటీసీ శిక్షణ ఇస్తుందన్నారు. ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమాన్ని మరింతగా విస్తరించి ఏజెన్సీ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఐటీసీ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సీఎస్సార్ నిధులతో గ్రామాల్లో మౌలికవసతులు, విద్య, వైద్య రంగాల్లో అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఏజెన్సీలోని పేదల ఆర్థికాభివృద్ధికి ఐటీసీ అన్ని విధాల చేయూతనందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, జనరల్ మేనేజర్(హెచ్ఆర్) శ్యామ్‌కిరణ్, చెంగలరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ' విద్యార్థులకు రవాణా చార్జీలు

ఉమ్మడి జిల్లాకు రూ.1.81 కోట్లు

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలలకు దూరంగా ఉన్న ఆవాసాల నుంచి వచ్చి వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వం ఇటీవల రవాణా చార్జీలను మంజూరు చేసింది. 2024-2025 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన విద్యార్థుల ఖాతాల్లో ఈ నిధులు జమ చేయనున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు లేకపోవడంతో సమీపంలోని పాఠశాలలకు ఆటోలు, బస్సుల్లో కొందరు, సైకిళ్లపై, కాలినడకన ఇంకొందరు వెళ్లి వస్తున్నారు. కిలోమీటర్ దూరం నుంచి వచ్చి వెళ్లే 6, 7, 8 తరగతుల విద్యార్థులతో పాటు మూడు కిలోమీటర్ల దూరాన ఆవాసాలు ఉన్న 9, 10 తరగతుల విద్యార్థులకు రవాణా చార్జీలు కేటాయించారు. భద్రాద్రి జిల్లాలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 124 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 547మంది, హైస్కూళ్లలో చదివే విద్యార్థులు 401 మంది.. మొత్తం 1,072 మందికి రవాణా భత్యంగా రూ.64.32లక్షలు మంజూరు చేశారు. ఇక ఖమ్మం జిల్లాలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 158 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు 935 మంది, హైస్కూళ్లలో చదువుతున్న 866 మంది.. మొత్తం 1,959 మందికి రూ.1,17,54,000 మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,031 మంది విద్యార్థులకు రూ.1,81,86,000 విడుదల చేశారు. అలాగే, పీఎంశ్రీ(ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా ఎంపికైన భద్రాద్రి జిల్లాలోని 137మందికి రూ.82,200, ఖమ్మం జిల్లాలో 642 మంది విద్యార్థులకు రూ.3,85,200 మంజూరు చేశారు. కాగా, విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ఈ నగదు జమ అవుతాయని, ఖాతాలు లేని వారు పోస్టల్ పేమెంట్ బ్యాంక్‌లో ఖాతా తెరిస్తే జమ చేస్తామని సమగ్ర శిక్షా అభియాన్ భద్రాద్రి జిల్లా కోఆర్డినేటర్ సతీష్ తెలిపారు.

14న ఫాల్గుణ పౌర్ణమి వేడుకలు

రామయ్య పెళ్లి పనులకు ఆ రోజే శ్రీకారం



భద్రాద్రి రామాలయం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 14న ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామయ్య పెళ్లి పనులకు ఆరోజే శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద పసుపు దంచి తలంబ్రాలు కలిపే వేడుక ప్రారంభం అవుతుందని, అనంతరం వసంతోత్సవం, డోలోత్సవం ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా బేడా మండపంలో జరిగే నిత్యకల్యాణాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. భద్రాచలం దివ్యక్షేత్రానికి అనుబంధంగా ఉన్న పర్ణశాలలోనూ ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తులు ప్రసాదాలు విక్రయించొద్దు..

శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులు, తోపుడు బండ్ల వారు, ఇతరులు ప్రసాదాల పేరుతో లడ్డూలు, పులిహోర విక్రయించడాన్ని నిషేధించినట్లు ఈఓ రమాదేవి తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూడీఐడీ కార్డుల జారీపై అపోహలు వద్దు

కలెక్టర్ జితేష్ వి. పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్.వి.పాటిల్, పక్కన అధికారులు

చుంచుపల్లి: దివ్యాంగులకు యూనిక్ డిజబిలిటీ ఐడీ కార్డుల జారీపై ఎలాంటి అపోహలు వద్దని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఐడీఓసీలో దివ్యాంగులు, మీసేవా కేంద్రాల నిర్వాహకులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఇకపై సదరం సర్టిఫికెట్లు జారీ విధానం ఉండదని, అందుకే యూడీఐడీ కార్డులు జారీ చేయనున్నామని తెలిపారు. వైద్యులు ధ్రువీకరించిన వైకల్య శాతం సర్టిఫికెట్‌తో పాటు దివ్యాంగుల పూర్తి వివరాలను యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేస్తే ఐడీ కార్డులు స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా వారి చిరునామాకు చేరుతాయని వెల్లడించారు. ఈ కార్డుల కోసం మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. గతంలో సదరం ద్వారా 8 రకాల వైకల్యాలకు మాత్రమే ఉండేదని, ఇప్పుడు యూనిక్ కార్డులను 21 రకాల వైకల్యాలు గల వారికి మంజూరు చేస్తున్నామని తెలిపారు. యూడీఐడీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి ఐదు రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దరఖాస్తుదారులు పేరు, ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ, జెండర్, ఫొటో, సంతకం, ఆధార్ కార్డు నంబర్, అడ్రస్ తదితర సమాచారాలను నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మీసేవా కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు ఉత్తమ సర్వీస్ అందించాలని నిర్వాహకులకు సూచించారు. వారి నుంచి అధిక రుసుము వసూలు చేసినా, సేవల్లో నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మీసేవా కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా సంక్షేమ శాఖాధికారి స్వర్ణలత లెనినా, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని వినియోగించుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం) : మార్చి 31 నాటికి భూ క్రమబద్ధీకరణ చేసుకునేలా ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2020 తర్వాత లేఅవుట్ చేసిన వెంచర్లలో ప్లాట్లు తీసుకున్న 5,488 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారని, అందులో 400 మంది మాత్రమే డబ్బు చెల్లించారని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల ద్వారా ఇప్పటికే నోటీసులు జారీ చేసినా ఫోన్ నంబర్లు, చిరునామాల్లో తేడాలు ఉండడంతో కొందరికి చేరడం లేదన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో 2,112 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని వినియోగించుకోకుంటే ఆయా ప్లాట్లలో ఇల్లు నిర్మించుకోవాలంటే అప్పటి ప్లాట్ విలువపై ప్రో రేటా ఫీజుతో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. భవిష్యత్‌లో ప్లాట్ అమ్ముకోవాలన్నా ఎల్ఆర్ఎస్ ఉంటేనే విలువ పెరుగుతుందని చెప్పారు. సమావేశంలో సబ్ రిజిస్ట్రార్ వేణుమాధవ్, కొత్తగూడెం, పాల్వంచ టౌన్ ప్లానింగ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేరు మారినా సేవలు అంతంతే..

- సమస్యలకు నిలయంగా అశ్వారావుపేట పట్టణం
- ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్న మున్సిపల్ పాలన





అశ్వారావుపేట ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మట్టి (ఇన్‌సెట్) ఖమ్మం రోడ్‌లో లీకేజీ నీరు తోడుతున్న సిబ్బంది

అశ్వారావుపేట : ఎన్నో ఏళ్ల ఎదురుచూపుల తర్వాత ఎట్టకేలకు అశ్వారావుపేట మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. కానీ సేవలు మాత్రం ఇంకా గ్రామ పంచాయతీ స్థాయిలోనే ఉన్నాయి. ఈ మున్సిపాలిటీకి ఇన్‌చార్జ్ కమిషనర్, జేఏఓ, టీపీఓలను నియమించిన ప్రభుత్వం.. ఆ తర్వాత పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తోంది. రెగ్యులర్ అధికారులను నియమించకపోవడం, అవసరమైన నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. బిల్ కలెక్టర్లు వసూలు చేసే పన్నుల జమ, ఖర్చులు చూసుకోవడం మినహా మరో పనేమీ జరగడం లేదు. ఇంటి అనుమతుల కోసం వచ్చేవారిని ఎల్ఆర్ఎస్ పేరుతో వెనక్కు పంపుతున్నారు. పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. అశ్వారావుపేట, గుర్రాలచెరువు, పేరాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లే ప్రస్తుతం మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. పట్టణ పరిధిలోని జాతీయ రహదారిని ఊడ్చిన దాఖలాలు లేవు. రహదారి మొత్తం దుమ్ము, ధూళితో దర్శనమిస్తుండగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇక జాతీయ రహదారి వెంట కూడా వీధి దీపాలు వెలగడం లేదు. తాగునీటి సరఫరా కూడా గతం కంటే మెరుగుపడలేదు. ఖమ్మం రోడ్‌లోని ఓ రెస్టారెంట్ వద్ద తాగునీటి పైప్‌లైన్ నెల రోజులుగా లీకవుతూ నీళ్లు వృథాగా పోతున్నాయి. ఆ తర్వాత అవే మురికి నీరు పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్నాయి. ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు వచ్చి పగటి వేళలో నీళ్లు తోడి పోతుండగా మరుసటి రోజు తెల్లారేసరికి మళ్లీ గుంత నిండుతోంది. ఇదే నిత్యకృత్యం తప్ప సమస్య పరిష్కారం కాలేదు. గ్రామపంచాయతీలుగా ఉన్నప్పటి తాగునీటి ట్యాంకర్లను మోడల్ కాలనీలో అనధికారికంగా ఇళ్ల నిర్మాణాలకు, పునాదుల్లో నీళ్ల నింపేందుకు వినియోగిస్తున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా పాత పంచాయతీ కార్యదర్శులే సేవలందిస్తున్నారు. మున్సిపల్ పాలన ఎప్పుడు ప్రారంభిస్తారని ఇన్‌చార్జ్ కమిషనర్ సుజాతను వివరణ కోరగా.. ఇంకా పూర్తిస్థాయిలో సిబ్బంది స్థాయిలో రాలేదని.. మరికొంత సమయం పడుతుందని చెప్పారు.

క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


సీసీ కెమెరాలను అమర్చిన పౌరసరఫరాల శాఖ అధికారులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట సరిహద్దు చెక్ పోస్టు వద్ద పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం సీసీ కెమెరాలను అమర్చారు. తెలంగాణ నుంచి ఏపీకి అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యంపై 'బియ్యం దందాను ఆపేదెవరు'అనే శీర్షికన ఈ నెల 5న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలతో నిఘా పెంచారు. ఇప్పటికే సూర్యాపేట జిల్లా మెట్‌పల్లి, కోదాడ వద్ద కెమెరాలు ఏర్పాటు చేశామని, తాజాగా అశ్వారావుపేట వద్ద కూడా ఏర్పాటు చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ప్రాజెక్ట్ అసోసియేట్ శ్రవణ్, అసిస్టెంట్ అక్బర్ తెలిపారు. వారి వెంట అశ్వారావుపేట సివిల్ సప్లయిస్ డీటీ గుర్రం ప్రభాకర్ ఉన్నారు.

రేపు జిల్లా సీనియర్ హాకీ మెన్ ఎంపికలు

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లిలోని రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 13న సీనియర్ హాకీ మెన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బట్టు ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపినవారిని ఈనెల 16 నుంచి 18 తేదీ వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు హాకీ ఇండియా గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

యువికకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: యువశాస్త్రవేత్తలను తయారుచేసేందుకు ఇస్రో చేపట్టిన కార్యక్రమం యువికకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 9వ తరగతి విద్యార్థులు అర్హులని, ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 7న ఎంపికైన జాబితా విడుదల చేస్తారని, ఎంపికైన విద్యార్థులకు మే 19 నుంచి 30వ తేదీ వరకు ఇస్రోకు చెందిన ఏడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని కోరారు.

ఎక్సైజ్ ఉద్యోగులకు రివార్డులు

ఖమ్మంక్రైం: గంజాయి రవాణా, అమ్మకం కేసుల్లో నిందితుల అరెస్ట్, శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టిన ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎక్సైజ్ ఉద్యోగులు రివార్డులు అందుకున్నారు. వీరిని హైదరాబాద్‌లో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించి రివార్డులు అందజేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఖమ్మం, కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెండెంట్లు నాగేందర్‌రెడ్డి, జానయ్య, మణుగూరు, భద్రాచలం సీఐలు రాజిరెడ్డి, రహీమున్నీసాబేగంతో పాటు రాజు, సర్వేశ్వరరావు, రవికుమార్, కానిస్టేబుళ్లు మారేశ్వరావు, నాగేశ్వరరావు, పగిడిపర్తి గోపి రివార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన ఎక్సైజ్ ఉద్యోగి

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ సమయం సమీపించినా తీరు మార్చుకోలేని ఎక్సైజ్ ఉద్యోగి ఒకరు లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం బస్ డిపో రోడ్డులో సాయికృష్ణ బార్ నిర్వహించిన శ్రీనివాస్ ఆరేళ్ల క్రితం మూసివేశాడు. మళ్లీ తెరవాలని నిర్ణయించుకున్న ఆయన ఏడాది లైసెన్స్ ఫీజు చెల్లించగా ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో బార్ లైసెన్స్‌కు జిరాక్స్ కాపీ కావాలని న్యాయవాది చెప్పడంతో శ్రీనివాస్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ భూక్యా సోమ్లానాయక్‌ను సంప్రదించాడు. ఇందుకోసం రూ.2వేలు డిమాండ్ చేయగా ఆర్థిక సమస్యలతో అంత ఇచ్చుకోలేనని చెప్పాడు. అయితే, లైసెన్స్ శ్రీనివాస్ తల్లి పేరిట ఉన్నందున ఆమెనే తీసుకురావాలని సూచించాడు. కానీ వృద్ధురాలైన ఆమె రాలేదని చెప్పినా ససేమిరా అనడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో వారి సూచన మేరకు రూ.1,500 ఇస్తానని శ్రీనివాస్ చెప్పగా సోమ్లానాయక్ అంగీకరించాడు. ఈమేరకు నగదుతో శ్రీనివాస్‌ను పంపించి మాటువేసిన ఏసీబీ అధికారులు డబ్బు తీసుకుంటుండగా సోమ్లాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. కాగా, ఏసీబీ దాడి జరిగిన సమయాన ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి సహా పలువురు అధికారులు ఉత్తమ పనితీరు కనబర్చినందుకు గాను హైదరాబాద్‌లో రివార్డులు అందుకుంటుండడం గమనార్హం. 2012లో ఇదే ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఓ ఉద్యోగి పట్టుబడిన విషయాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు.

కొలిక్కివచ్చిన స్థల సేకరణ!


ఐటీడీఏ, ఆస్పత్రి నిర్మాణం కోసం ఖాళీ చేయించనున్న సింగరేణి క్వార్టర్లు

ఇంటిగ్రేటెడ్ స్కూల్, ప్రభుత్వాస్పత్రి, ఐటీడీఏలకు 35 ఎకరాలు గుర్తింపు

- సుమారు రూ.248 కోట్లతో మూడు ప్రధాన భవనాల నిర్మాణం
- ఇల్లెందులో ఈ నెల 17న మంత్రులు శంకుస్థాపన చేసే అవకాశం

ఇల్లెందు: నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ ఐటీడీఏ, 100 పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలకు స్థలాల ఎంపిక తుది దశకు చేరింది. ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇల్లెందులోని మెయిన్‌రోడ్‌లో ఉన్న సింగరేణి స్థలాలను స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి పరిశీలించి సుముఖత వ్యక్తం చేశారు. కొందరు సింగరేణి ఉద్యోగులు క్వార్టర్లలో నివాసం ఉంటుండగా, వారిని మరోచోటకు తరలించాల్సి ఉంది. వారం పది రోజుల్లో సింగరేణి సీఎండీ నుంచి కూడా ప్రభుత్వ ఐటీడీఏ స్థలం కోసం అనుమతి వచ్చే అవకాశం ఉంది. మూడు ప్రధాన భవనాల నిర్మాణాలకు 35 ఎకరాల స్థలాల ఎంపిక దాదాపుగా ఒక కొలిక్కివచ్చింది.

నాన్‌వెజ్ మార్కెట్, సింగరేణి స్థలంలో ఆస్పత్రి, ఐటీడీఏ

ఇల్లెందులో రూ.4.50 కోట్లతో గత ప్రభుత్వం వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టింది. నిధుల్లేక పనులు నిలిచిపోగా మరో వైపు పట్టణానికి దూరంగా ఉండటంతో ప్రజలు, వ్యాపారులు వచ్చే అవకాశం ఉండదని ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పూర్తిగా నిలిపివేసింది. తాజాగా ఆ స్థలాన్ని ప్రభుత్వ ఐటీడీఏ భవనం కోసం కేటాయించాలని నిర్ణయించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి నుంచి ఉప్పిడి మిల్లు వరకు సుమారు అర కిలోమీటర్ మేర సింగరేణి క్వార్టర్లు ఉన్నాయి. వాటిలో 15 మంది సింగరేణి ఉపాధ్యాయులు, కార్మికులను అయ్యప్ప టెంపుల్ ఏరియా, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వెనుక ఉన్న ఖాళీ క్వార్టర్లకు తరలించనున్నారు. ఇక ప్రైవేటు వ్యక్తులను క్వార్టర్ల నుంచి ఖాళీ చేయించనున్నారు. మార్కెట్, సింగరేణి క్వార్టర్ల స్థలం కలుపుకుని రోడ్డు వెంట ఉన్న దాదాపు పదెకరాలను 100 పడకల ఆస్పత్రి, ఐటీడీఏల కోసం ప్రభుత్వం తీసుకోనుంది. దీంతో ప్రభుత్వాస్పత్రి, ఐటీడీఏ ప్రభుత్వ నడిబొడ్డున ఏర్పాటుకానున్నాయి.

25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలంపై చిక్కుముడి వీడే అవకాశం ఉంది. మున్సిపల్ డంప్ యార్డు నుంచి రైల్వే లైన్ వరకు ఉన్న 25 ఎకరాల స్థలంలో భవన నిర్మాణం చేయాలని నిర్ణయించారు. అయితే అక్కడి రైతులు కొందరు ఆ భూమి తమదంటూ కోర్టును ఆశ్రయించారు. సదరు రైతుల చూపుతున్న భూమి ఆ సర్వే నంబర్‌లో లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇదే విషయం కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సర్వే చేశారు. రెండు మూడు రోజుల్లో స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామని సింగరేణి జీఎం వి.కృష్ణయ్య, తహసీల్దార్ కె.రవికుమార్ కలెక్టర్ జితేష్‌కు, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వివరించారు. ఐటీడీఏ, ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలకు ఈ నెల 17న మంత్రులు శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. ఆలోగా అధికారులు స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తిచేయాల్సిఉంది. కాగా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు సుమారు రూ. 200 కోట్లు, ప్రభుత్వాస్పత్రికి రూ.37 కోట్లు, ఐటీడీఏకి రూ.11 కోట్లు.. మొత్తం రూ.248 కోట్లను ప్రభుత్వం కేటాయించిన విషయం విదితమే.

శ్రమించారు.. గ్రూప్స్‌లో మెరిశారు

గ్రూప్–1లో సత్తా చాటిన ఎస్‌ఐ


ఎస్‌ఐ సందీప్‌కుమార్

ఇల్లెందు: జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షల్లో ప్రతిభ చూపారు. ఇల్లెందు ఎస్‌ఐ దొడ్డపనేని సందీప్ కుమార్ గ్రూపు–1లో సత్తా చాటారు. మెయిన్స్ పరీక్షలో 502 మార్కులు సాధించారు. ఇప్పటివరకు ఆరు ఉద్యోగాలు కైవసం చేసుకుని ప్రస్తుతం ఎస్‌ఐగా పని చేస్తున్నారు. ఆయనది ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామం కాగా, తల్లిదండ్రులు సర్వేశ్వరరావు, పద్మ వ్యవసాయం చేస్తున్నారు. గ్రూప్–4, రైల్వేలో రెండు ఉద్యోగాలు, పంచాయతీ కార్యదర్శి, ఫారెస్టు శాఖలో కొలువు కొట్టారు. తాజాగా గ్రూప్–1 సాధించడంతో ఆర్డీఓ లేదా డీఎస్పీ ఉద్యోగం లభించే అవకాశం ఉంది.

గ్రూప్–2లో 61వ ర్యాంక్


పేరాల రాజ్‌కిషోర్

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన పేరాల రాజ్‌కిషోర్ తొలి ప్రయత్నంలోనే గ్రూప్–2లో రాష్ట్రస్థాయిలో 61వ ర్యాంకు సాధించాడు. కోచింగ్‌కు వెళ్లకుండా ఇంటివద్దే ఆన్‌లైన్‌లో గ్రంథాలయాల్లో చదివి పరీక్షకు సన్నద్ధమయ్యాడు. కుమారుడు విజయం సాధించడంతో తల్లిదండ్రులు సరిత, రాజేంద్రప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు.

సింగరేణి ఉద్యోగి అభిలాష్‌కు 86వ ర్యాంక్


వానపర్ల అభిలాష్

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేపీయూజీ మైన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వానపర్ల అభిలాష్ గ్రూప్–2 పరీక్షల్లో సత్తా చాటారు. 86వ ర్యాంక్ సాధించారు. అభిలాష్ తండ్రి ప్రసాదరావు రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి కాగా, తల్లి భార్గవి పినపాకలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు, యూనియన్ నాయకులు, అధికారులు అభిలాష్‌ను అభినందించారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్) స్వామివారి ఉత్సవ విగ్రహాలు

భక్తుల పాలిట కొంగుబంగారం.. బాలాజీ

నేటి నుంచి అన్నపురెడ్డిపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసిస్తుంటారు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఈనెల 12 నుంచి 17 వరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 14వ తేదీ రాత్రి 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరగనుంది. 17న శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

చారిత్రక నేపథ్యం ఇలా..

కాకతీయుల సామ్రాజ్యంలో అన్నపురెడ్డి అనే సేనాని ఈ ప్రాంతానికి వచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆ పేరుతోనే గ్రామానికి అన్నపురెడ్డిపల్లి అని నామకరణం జరగగా.. ఆయన ఇక్కడ చిన్న గుడి నిర్మించారు. అంతేకాక ఈ ప్రాంతంలో రాముడు చెరువు, నల్లచెరువును కూడా నిర్మాణం చేశారు. అనంతరం ఈ ప్రాంతానికి వచ్చిన కల్లూరి వెంకటప్పయ్య మాత్యులు 1870 ప్రాంతంలో గుడిని విస్తరింపజేసినట్లు తెలుస్తోంది. 1969లో ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. 1974లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఆధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేశారు. నైజాం నవాబు కాలంలోనే అప్పటి నవాబు మీర్ మహబూబ్ అలీఖాన్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాది ఎకరాల భూమిని అగ్రహారంగా ఇచ్చినట్లు సమాచారం. అందులో ప్రస్తుతం 2,300 ఎకరాల భూములు స్వామివారికి ఉన్నాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం

స్వామివారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలువైపుల నుంచీ వేలాది మంది భక్తులు వస్తారు. వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. చలవ పందిళ్లు వేయించాం. భక్తుల కోసం ప్రత్యేకంగా సత్తుపల్లి, కొత్తగూడెం డిపోల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుస్తాయి.

–పాకాల వెంకటరమణ, ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్

బీటీపీఎస్‌కు జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్..


జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్న భారీ వాహనం

పాల్వంచరూరల్: భారీ వాహనంలో పెద్ద జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. మంగళవారం పాల్వంచలోని బీసీఎం జాతీయ రహదారి మీదుగా విద్యుత్ కేంద్రానికి తరలిస్తుండగా పలువురు ఆసక్తిగా తిలకించారు. మణుగూరు బీటీపీఎస్‌లో గత జూన్ చివరిలో జీటీ(జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్)–1 పిడుగు పడి కాలిపోయింది. దీంతో మరమ్మతులకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకు తరలించారు. మరమ్మతులు పూర్తికావడంతో సుమారు 15 రోజుల క్రితం 112 టైర్లు కలిగిన భారీ వాహనంపై జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకుని ఇంజనీర్లు బయల్దేరారు. పాల్వంచ మీదుగా వెళ్తున్న వాహనం బుధవారం మణుగూరుకు చేరే అవకాశం ఉంది.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

ఇల్లెందు: అక్రమంగా తరలిస్తున్న రూ.50 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను ఇల్లెందు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని 15 నంబర్ బస్తీకి చెందిన రాకేష్‌కుమార్ ఖమ్మం నుంచి ఇల్లెందుకు గుట్కా తరలిస్తుండగా లలితాపురం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలో భాగంగా గుర్తించినట్లు ఎస్సై సూర్య తెలిపారు. గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కేసులు సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ రోహిత్‌రాజు


మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: కేసుల్లో ప్రతీ విషయాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. మంగళవారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులతో సమన్వయం చేసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీలో అలసత్వం వహించొద్దన్నారు. నేరస్తులకు శిక్షపడేలా చేసి కన్విక్షన్ రేటు పెంచాలని కోరారు. ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నాగరాజురెడ్డి, ఎస్సైలు హారిక, హసీనా తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ


మొక్కలు దగ్ధమైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

చంద్రుగొండ : చంద్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ మంగళవారం సందర్శించారు. 'పీహెచ్‌సీలో చెట్లు దగ్ధం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆస్పత్రిని సందర్శించి డాక్టర్ తనుజ, సిబ్బందితో మాట్లాడి చెట్ల దగ్ధమైన సంఘటనపై ఆరా తీశారు. కాలిపోయిన ప్రదేశాన్ని శుభ్రం చేయించి కొత్తగా మొక్కలు నాటించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని, రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత ఎర్రగుంట పీహెచ్‌సీని సందర్శించి అసంక్రమిత వ్యాధులపై సర్వే పక్కాగా నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక, డీపీఎంఓ శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతారాంపురం శివారు ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కిరాణ దుకాణంలో చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని రాజీవ్‌నగర్‌తండాలోని కిరాణ దుకాణంలో చోరీ జరిగింది. దుకాణంలో నగదు రూ.25 వేలు, 10 లీటర్ల పెట్రోల్, 20 లీటర్ల డీజిల్, ఇతర కిరాణ సామగ్రి అపహరించారు. బాధితురాలు ఎండీ షరీఫాబేగం మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఓపెన్ డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్

పాల్వంచరూరల్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల్లో జోరుగా మాస్‌కాపీయింగ్ జరుగుతోంది. కొందరు విద్యార్థులు మాస్‌కాపీయింగ్ పాల్పడుతుండగా స్క్వాడ్ బృందం తనిఖీ చేసి పట్టుకుంది. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనిర్సిటీ డిగ్రీ పరీక్షలు ఈ నెల1 నుంచి నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన డిగ్రీ సెకండ్ ఇయర్ థర్డ్ సెమిస్టర్ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఏడుగురు విద్యార్థులను ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుని డీబార్ చేసింది. కాగా మంగళవారం పరీక్షకు 195 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 180 మంది హాజరయ్యారని, 15మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పోలీసుల అదుపులో 16 మంది వలస కూలీలు

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామ పంచాయతీ వీరభద్రాపురం గ్రామ సమీపంలో ఓ రైతు మిర్చితోట కోసేందుకు వచ్చిన వలస కూలీలను సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. జూలూరుపాడు, కొత్తగూడెం పోలీసులు కలిసి వలస కూలీలు ఉంటున్న గుడారాల వద్దకు వెళ్లి నక్సలైట్లతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 16 మందిని జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఆ తర్వాత కొత్తగూడెం తీసుకెళ్లి విచారిస్తున్నట్లు తెలిసింది. వలస కూలీలను ప్రత్యేక వాహనాల్లో కొత్తగూడెం తీసుకెళ్లారు. ఈ నెల 3న రాత్రి శంభునిగూడెం గ్రామ సమీపంలో ఓ రైతు మిర్చి తోట వద్ద గుడారాల్లో నివాసం ఉంటున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన నలుగురు వలస కూలీలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

సబ్‌జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరార్

మూడు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

సత్తుపల్లిటౌన్: రిమాండ్ ఖైదీ ఒకరు సబ్‌జైలు గోడ దూకి పరార్ కాగా, మూడు గంటల్లోనే తిరిగి పోలీసులు పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన పెంద్ర రమేష్‌ను భార్యపై హత్యాయత్నం కేసులో రిమాండ్ ఖైదీగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి సబ్‌జైలుకు గత నెల 3వ తేదీన తీసుకొచ్చారు. అయితే, మంగళవారం ఉదయం 10 గంటల సమయాన సిబ్బంది సమీపంలో లేనట్లు గుర్తించి.. గోడకు తాడు వేసి అక్కడి విద్యుత్ తీగలపై దుప్పటి కప్పిన రమేష్ 18 అడుగుల సబ్‌జైలు గోడ పైనుంచి దూకి పరారయ్యాడు. కాసేపటికే గుర్తించిన సబ్ జైలు సిబ్బందితో పాటు పోలీస్ బృందాలు ఆయన కోసం గాలింపు చేపట్టారు. ఓపక్క గాలిస్తూనే విషయాన్ని రమేష్ కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా.. ఆయన ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలోని ఓ ఆయిల్‌పామ్ తోటలో ఉన్నట్లు అక్కడి బంధువుల ద్వారా సమాచారం అందింది. దీంతో పోలీసు బృందాలు వెళ్లి మూడు గంటల్లోనే తీసుకొచ్చారు. జైలు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నా ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఉన్నతాధికారుల పరిధిలో శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని ఉమ్మడి ఖమ్మం జిల్లా సబ్ జైళ్ల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఖైదీ పరారీపై పోలీసులకు ఫిర్యాదు చేసినందున మరో కేసు నమోదవుతుందని వెంకటేశ్వర్లు, సత్తుపల్లి సబ్‌జైల్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా, రమేష్ జైలులోని గోడ దూకి పరారైనట్లు అధికారులు చెబుతున్నా.. జైలు బయట ఊడ్చే పని ఆయనకు అప్పగించగా సిబ్బంది ఏమరుపాటుగా ఉన్న సమయాన్ని గుర్తించి పరారైనట్లు ప్రచారం జరుగుతోంది.

నిందితుడికి జైలుశిక్ష

భద్రాచలంటౌన్: వాహనాన్ని అతి వేగంగా నడిపి ఓ వ్యక్తి గాయపడటానికి కారణమైన వాహన డ్రైవర్‌కు భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ 15 నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. 2016 సంవత్సరంలో ప్రమాదం జరగ్గా, కేసు నమోదు చేసిన బూర్గంపాడు పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. బాధితుడి తరపున న్యాయవాది శ్రీనివాస్ వాదించారు.

నాటుసారా స్వాధీనం

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి, కొత్త తండా, మంగ్య తండా, శంభునిగూడెం, చంద్రుతండా, రాజు తండా, సూర్యాతండా గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. నాలుగు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసింది. ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్, గురవయ్య, పార్థసారథి, వెంకటనారాయణ, రమేష్, సుమంత్ పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: దాడి ఘటనలో ఆరుగురిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన జగన్నాథం ఝున్సీకి అదే ప్రాంతానికి చెందిన రాములమ్మకు గొడవ జరిగింది. దీంతో రాములమ్మ, పూజారి శిరీష, ప్రతాప్, అనిల్, రాంబాబు తదితరులు తిట్టి, దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

దాడి ఘటనలో..

పాల్వంచ: దాడి ఘటనలో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని బొల్లేరుగూడెం ఏరియాకు చెందిన లగిశెట్టి నాగతేజ ఈ నెల 9న ఇంటికి వెళుతుండగా వెంకటేష్, మధు, ఆకాష్ అనే వ్యక్తులు డెకరేషన్ సామగ్రి వ్యాన్‌ను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. దీంతో వ్యాన్ తీయాలని కోరగా నాగతేజతో గొడవకు దిగారు. ఈ క్రమంలో రాడ్‌తో కొట్టగా తలపగిలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.